క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



అడ్డాకుల: మూసాపేటలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని నందిపేటకు చెందిన సురేష్, మంజుల దంపతులు ద్విచక్ర వాహనంపై భూత్పూర్ వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మూసాపేట శివారుకు రాగానే ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో నరేష్, మంజులతో పాటు మరో బైక్‌పై ఉన్న రాములుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే ఎల్అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన రాములు మూసాపేట ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నారు. విధులు ముగించుకొని మహబూబ్‌నగర్‌కు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు.

ఓటమి గెలుపునకు నాంది కావాలి : బీజేపీ



రాజాపూర్: నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది కావాలని బీజేపీ జడ్చర్ల అసెంబ్లీ ఇన్‌చార్జ్ బాలత్రిపురసుందరీదేవి అన్నారు. గురువారం మండలంలోని రాయపల్లిలో నిర్వహించిన ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలు మానసిక ప్రశాంతతను ఇస్తాయన్నారు. అంతేగాకుండా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతగానో ఉపయోగపడతాన్నారు. అనంతరం మొదటి బహుమతి గెలుపొందిన ముదిరెడ్డిపల్లి టీమ్‌కు తను సొంతంగా రూ.30 వేల నగదు, జ్ఞాపిక అందజేశారు. ద్వితీయ బహుమతిని పీఆర్‌జీ 11 టీమ్‌కు ఏఎంసీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్ రూ.15 వేలతో పాటు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఉమేష్‌గౌడ్, నవీన్‌గౌడ్, ఆర్గనైజర్లు ప్రవీణ్‌గౌడ్, మధుసూదన్‌గౌడ్, వీరస్వామి, దూళ్ల ప్రవీణ్, మల్లేష్‌గౌడ్, నర్సింహులు, సూరిబాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు లోక్ అదాలత్

కోస్గి: ఈ నెల 10న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీఐ జనార్దన్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో ఎలాంటి అప్పీల్ లేకుండానే ఇరు వర్గాలు రాజీ పడితే కేసులు ఎత్తివేస్తారన్నారు. ఆర్థిక లావాదేవీలు, బీమా, భూ తగాదాలు, డ్రంకెన్ డ్రైవ్, అత్తింటి వేధింపులు, మనోవర్తితోపాటు చట్టరిత్యా రాజీకి అర్హత ఉన్న కేసుల్లో పైసా ఖర్చు లేకుండా పరిష్కరించుకోవచ్చన్నారు. కోస్గి సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.

‘చేనేతబంధు’ అందించాలి

ధన్వాడ: నేతన్నలకు చేనేత బంధు అందించాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కెంచె ఉదయభాను అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులవృత్తుల వారికి ప్రభుత్వం అందజేయనున్న రూ.లక్ష ఆర్థికసాయం పథకంలో పద్మశాలీలకు చోటు కేటాయించకపోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. పద్మశాలీలు అన్ని కుల వృత్తుల వారి కన్నా వెనకబడిన వారని కనీస సహాయం రూ.లక్ష పథకంలోనూ స్థానం కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే పద్మశాలీలకు చేనేత బంధు పథకం కింద రూ.పది లక్షలు అందించాలని డిమాండ్ చేశారు.

మండలం చేసేంత వరకు ఉద్యమం



నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహారదీక్షలు 30వ రోజుకు చేరుకున్నాయి. గురువారం మైనార్టీ యూత్ సంఘం సభ్యులు దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకుడు రాము మాట్లాడుతూ.. కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు కలిగి ఉన్నా రాజకీయ దురుద్దేశంతోనే టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. స్థానిక నాయకులు, ఈ ప్రాంత ఎమ్మెల్యే చొరువ తీసుకుని సీఎం కేసీఆర్‌తో ప్రకటన ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో కెంచె శ్రీనివాసులు, యాదగిరి, కాశీనాథ్, చెన్నప్ప, సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు సలీం, హాజి మలాంగ్, రహమాన్, సులెమాన్, అఫ్రిద్, నయూం, పాషా, యాసిన్, అబ్బాస్, రహ్మాన్, ఆదాన్ పాల్గొన్నారు.


దేవరకద్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


దామాయపల్లిలో ఎడ్లబండిపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి


దేవరకద్ర మండలం నాగారంలో బోనాల ఊరేగింపు

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

- ఘనంగా ఊరూరా చెరువుల పండుగ
- పలు గ్రామాల్లోని వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

దేవరకద్ర: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత చెరువులు, కుంటలకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి స్థానిక పెద్ద చెరువు వద్ద జరిగిన చెరువుల పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దశాబ్దాల తరబడి మరమ్మతుకు నోచుకోని చెరువులు, కుంటలను మిషన్ కాకతీయ పథకం కింద అభివృద్ధి చేసినట్లు వివరించారు. పూడికతీత, కట్టల బలోపేతం, కాల్వలు, పిల్ల కాల్వల ఏర్పాటు, ఫీడర్ ఛానల్స్ అభివృద్ధితో చెరువులు, కుంటలకుకి నీరు సమృద్ధిగా చేరుతుందని తెలిపారు.

కట్ట మైసమ్మకు పూజలు..

పెద్ద చెరువు కట్ట మైసమ్మకు ఎమ్మెల్యే ఆల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు బోనాలు, బతకమ్మలతో మహిళలు స్వాగతం పలికారు. సమావేశం అనంతరం భోజనాలను ఎమ్మెల్యే స్వయంగా వడ్డించారు. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ, వైస్ ఎంపీపీ సుజాత, నాయకులు జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, బాలస్వామి, భాస్కర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, బుచ్చన్న, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: రైతు అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని దమాయపల్లిలో నిర్వహించిన ఊరూరా చెరువుల పండుగ ఉత్సవాల్లో ఆయన పాల్గొని ఎద్దులబండిపై ఊరేగింపుగా చెరువు దగ్గరకు చేరుకొని మహిళలతో కలిసి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అదేవిధంగా కోత్లాబాద్, బూర్గుపల్లి, పారుపల్లి, కోయిల్‌కొండ తదితర గ్రామాల్లో మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలను డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ అంజనేయులు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జయరాములు, నాయకులు ప్రవీణ్, రాజవర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, శ్రీపాద తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన పంటల సాగు : పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రభుత్వం రైతులకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ మిషన్ భగీరథ పథకం కింద చెరువుల పూడికతీత చేపట్టడంతో నీటి సామర్థ్యం పెరిగిందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని గాదిర్యాల్, చౌదర్‌పల్లి, మహమ్మదాబాద్ తదితర గ్రామాల్లో జరిగిన చెరువుల పండుగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చెరువుల పూడిక తీతతో బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరిగాయని.. పంటల సాగు విస్తీర్ణం కూడా ఎక్కువైందన్నారు. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో చేపల పెంపకం చేపట్టి మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించారని.. ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని వివరించారు.

అంబరాన్నంటేలా..

నవాబుపేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం గ్రామాల్లోని చెరువుల వద్ద నిర్వహించిన సంబురాలు అంబరాన్నంటాయి. చెరువుల పండుగ సందర్భంగా ఆషాడంలో రావాల్సిన బోనాలు, దసరాకు రావాల్సిన బతుకమ్మ సంబురాలు ముందుగానే వచ్చినట్లు కనిపించింది. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని చెరువుల వద్దకు ప్రజాప్రతినిధులు, అధికారులు బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపుగా చేరుకొని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతుబంధు సమితి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, వెలుగు సిబ్బంది రమాదేవి, కాంచన తదితరులు పాల్గొన్నారు.

చెరువుల వద్ద సందడి..

మిడ్జిల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి చెరువుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మిడ్జిల్ నల్లచెరువు దగ్గర నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ సుదర్శన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు తర్వాత మిషన్‌కాకతీయ పథకంలో ప్రతి చెరువును అభివృద్ధి చేయడంతో గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ రాధిక, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా పండుగ..

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో గురువారం సాయంత్రం చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలు బోనాలు, బతుకమ్మలు, చేపల వలలతో ఊరేగింపుగా చెరువుల వద్దకు చేరుకొని ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం అక్కడే భోజనాలు చేశారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ కాకతీయతో పూర్వ వైభవం..

రాజాపూర్: మండలంలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి, రంగారెడ్డిగూడ, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో మహిళలు బోనాలు, బతుకమ్మలతో ర్యాలీగా వచ్చి ఉత్సవాల్లో పాల్గొన్నారు. తిర్మలాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. మిషన్ కాకతీయ పథకంలో గ్రామాల్లోని చెరువుల్లో పూడిక తొలగించి పూర్వ వైభవం తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డిగూడ సర్పంచ్ శశికళారెడ్డి, తిర్మలాపూర్ సర్పంచ్ మహేశ్వరి, రాయపల్లి సర్పంచ్ గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గాధిర్యాల్ ఊరచెరువు వద్ద పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మిషన్ కాకతీయతో చెరువుల అభివృద్ధి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ మైసమ్మ చెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ పాల్గొని అమ్మవారికి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను చెరువులో వదిలారు. ఎంపీటీసీ సభ్యుడు రాజుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ నర్సింహులు, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, మన్యంకొండ దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యుడు చిన్నయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఊరూరా దశాబ్ది ఉత్సవాలు..

బాలానగర్: మండలంలోని కేతిరెడ్డిపల్లిలో జరిగిన ఉత్సవాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కళ్యాణి పాల్గొని గ్రామస్తులతో కలిసి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను చెరువులో వదిలి తెలంగాణ పండుగను చాటిచెప్పారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఎంపీపీ కమల, వైస్ ఎంపీపీ వెంకటాచారి, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఊరూరా పండుగ..

హన్వాడ: మండలంలోని వేపూర్, నాయినోనిపల్లి, హన్వాడ, గొండ్యాల్, కొత్తపేట తదితర గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం చెరువుల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గండేడ్ మండలంలో..

గండేడ్: మండలంలోని గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ పుల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాంరెడ్డి, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంటలో..

చిన్నచింతకుంట: మండలంలోని మద్దూరు, చిన్నచింతకుంట, అప్పంపల్లి, గూడూరు, తిర్మలాపురం గ్రామాల్లో ఆడపడుచులు బతకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి చెరువులో వదిలారు. మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


కోడూర్ మైసమ్మ చెరువు వద్ద బతుకమ్మలతో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు


కేతిరెడ్డిపల్లి చెరువులో బతుకమ్మను వదులుతున్న జెడ్పీటీసీ కళ్యాణి తదితరులు


ఇప్పటూర్ పెద్దచెరువులో బతుకమ్మల నిమజ్జనం


అడ్డాకులలో..


నాయినోనిపల్లిలో..

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

రాజాపూర్: మండల కేంద్రంలోని శివసీతారామాంజనేయస్వామి ఆలయంలో మూడురోజులుగా హోమాలు, యాగాలు కొనసాగుతున్నాయి. గురువారం శివలింగం, నంది విగ్రహాలతో పాటు నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కప్పెరి బచ్చిరెడ్డి, బీజేపీ జడ్చర్ల అసెంబ్లీ ఇన్‌చార్జ్ బాలత్రిపురసుందరీదేవి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కృష్ణయ్య, కార్యదర్శి అచ్చయ్యగుప్తా, నాయకులు మహిపాల్‌రెడ్డి, నరహరి, సత్యయ్య, నర్సింహులు, రామకృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని మహబూబ్‌నగర్‌లోని టచ్ అనాథశ్రమానికి చెందిన 80 మంది పిల్లలకు టీయూడబ్ల్యూజే (ఐజేయూ–143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్- మాధవి దంపతులు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. తన తల్లి నారాయణమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పిల్లలకు బ్యాగ్‌లు పంపిణీ చేసినట్లు మారుతీసాగర్ తెలిపారు. చదువు మాత్రమే జీవితంలో ప్రతి ఒక్కరిని ఉన్నత స్థాయికి చేర్చగలదని, ఈ విషయంలో విద్యార్థులు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు నరసింహ, భార్గవ్, ఆకాష్, సంస్థ నిర్వాహకులు వినయ్ పాల్గొన్నారు

మంత్రులకు ఘన స్వాగతం


జాతీయ రహదారిపై బైక్ ర్యాలీ

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల ఎస్‌జీడీ ఫార్మా వద్ద రూ.500 కోట్లతో కొత్త నిర్మించే ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి గురువారం వచ్చిన మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులు మూసాపేట వద్ద ఘన స్వాగతం పలికాయి. మూసాపేట నుంచి వేముల పరిశ్రమ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇదిలా ఉండగా సభలో మంత్రి మల్లారెడ్డి ప్రసంగ సమయంలో యువకులు ఈలలు, కేరింతలతో హోరెత్తించారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు..

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించినందుకుగాను గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌ను సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టీజీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్, డీఐఈఓ వెంకటేశ్వర్లు, సందీప్‌రెడ్డి, సాదిఖ్, ఇదాయత్‌అలీ, ఖతాల్ అహ్మద్, నిజాం మాసూమ్, జిల్లా అధ్యక్షుడు కరణం రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శివానంద్ తదితరులు ఉన్నారు.

రైతులకేదీ సహకారం!

- సాగు పరికరాలు, యంత్రాలకు అందని రాయితీ
- నాలుగేళ్లుగా అన్నదాతలకు తప్పని ఎదురుచూపులు


పారుపల్లిలో పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు (ఫైల్)

కోయిల్‌కొండ: వ్యవసాయమే జీవనోపాధిగా ఎంచుకున్న రైతులకు ప్రభుత్వం నుంచి సహకారం కొరవడింది. సాగు పరికరాలు, యంత్రాలపై రాయితీ ఎత్తివేయడంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెన్నంటి ఉండే సహకార సంఘాల ప్రోత్సాహం లేక పంటల సాగు కష్టతరంగా మారిందని రైతులు వాపోతున్నారు. వానాకాలం సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో సహకార సంఘాలు, వ్యవసాయ అధికారుల నుంచి ఎలాంటి సమాధానం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో 18,500 మంది రైతులు ఉండగా.. ఈ వర్షాకాలంలో 32 వేల ఎకరాల్లో వరి, జొన్న, కంది, పత్తి తదితర పంటలు సాగుచేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో పంటరుణాలు ఇవ్వడం, తిరిగి తీసుకోవడం, ధాన్యం కొనుగోళ్ల వరకే ప్రభుత్వం పరిమితమైందని రైతులు చెబుతున్నారు.


నష్టపోతున్న రైతులు..

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సహకార సంఘాలు కృషి చేసేవి. సాగు పద్ధతులు, అవసరమైన యంత్ర పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రాయితీపై అందించేవి. కానీ నాలుగేళ్లుగా సొసైటీలు అవేవీ ఇవ్వడం లేదు. వాటిపై ప్రభుత్వం రాయితీ కూడా ఎత్తివేసింది. దీంతో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నాణ్యతలేని ఉత్పత్తులను కొనుగోలు చేసి నష్టపోతున్నారు.

శాస్త్రవేత్తల సూచనలేవీ?

పంట ఉత్పత్తులను విక్రయిస్తే వచ్చే ఆదాయం కంటే ఖర్చు అధికం కావడంతో అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. సహకార సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు కొరవడి రైతులు నష్టపోతున్నారు. ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి అధిక దిగుబడి, సేంద్రియ సేద్యం, పాటించాల్సిన పద్ధతులు, ఎరువుల వాడకం, లాభసాటి పంటలు తదితర అంశాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఆధునిక సాగు పరికరాలు, యంత్రాలు, ట్రాక్టర్లు, పంపుసెట్లు తదితర వాటి ధరలు రూ.లక్షల్లో ఉంటాయి. వాటిని సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి అద్దెకు ఇవ్వాలని కోరుతున్నారు. నమ్మకమైన కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని వానాకాలం సాగుకు తక్కువ ధరకు విత్తనాల పంపిణీకి సంఘాలు కృషి చేయాలని వారు వేడుకుంటున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి..



మార్కెట్‌లో నకిలీ విత్తనాల దందా ఎక్కువగా ఉంది. చిన్న, సన్నకారు రైతులు అప్పులు తెచ్చి వ్యాపారుల మాటలు నమ్మి నాసిరకం విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో దిగుబడి రాక నష్టపోతున్నాం. వ్యవసాయ అధికారులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలి.

– సుధాకర్‌రెడ్డి, రైతు, బూర్గుపల్లి

తనిఖీలు చేపడుతున్నాం..



ఫర్టిలైజర్ దుకాణాలపై తరచూ దాడులు నిర్వహిస్తూ తనిఖీలు చేపడుతున్నాం. నకిలీ విత్తనాలు, పురుగు మందులు పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం. రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రాంపాల్, మండల వ్యవసాయాధికారి, కోయిల్‌కొండ

నేతన్నలను విస్మరించడం సరికాదు

నారాయణపేట రూరల్: బీసీ వర్గాల్లోని వివిధ కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించడాన్ని బీజేపీ స్వాగతిస్తుందని, అందులో చేనేత కార్మికులను విస్మరించడం సరికాదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాసులు విమర్శించారు. తొలి విడతలో 15 కులాలకు అందిస్తున్నట్లు చెప్పి నేతన్నలపై టీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూశారని దుయ్యబట్టారు. సిరిసిల్లతో పాటు, ముగనుగోడులో సైతం చేనేత కార్మికుల ఓట్లతో గెలిచి నేడు అన్యాయం చేశారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి సహకార సంఘం ఎన్నికలు జరపలేదని, నిర్వీర్యం చేయడానికే కేసీఆర్ పథకం వేస్తున్నారని విమర్శించారు. వెంటనే నేతన్నలపై తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.

ట్రాక్టర్ పట్టివేత

మాగనూర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీఆర్‌ఏ సందీప్ గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని అచ్చంపేటకు చెందిన రంగప్ప మండలకేంద్రంలోని పెద్దవాగు నుంచి అక్రమంగా గ్రామానికి ఇసుక తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న వీఆర్‌ఏ ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.